సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



కదం తొక్కిన గిరిజన రైతులు

గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు రెవెన్యూ పట్టాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.కృష్ణమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. - 8లో



లిఫ్ట్ ఇచ్చి దోపిడీ

తన బైక్‌పై లిఫ్ట్ ఇస్తానని చెప్పి కొంతదూరం తీసుకు వెళ్లి రూ.50వేలు నగదును దౌర్జన్యంగా లాక్కుని పరారైన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. - 8లో

పులివేషాల పోటీల బృందాలు సంప్రదించండి

విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవాలను అక్టోబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్నామని, ఉత్సవాల్లో పులివేషాల ప్రదర్శనకు సంబంధించి పోటీల్లో పాల్గొనే బృందాలు తమను సంప్రదించాలని మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఆర్.ఎస్.జాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 94900 66050, 94401 55 007 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాచ బాట రెడీ!

- విశాఖ-రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు కొలిక్కి
- ఐదు చోట్ల ఇంటర్ చేంజ్‌ల నిర్మాణ పనుల్లో పురోగతి
- నాలుగు చోట్ల రెస్ట్ ఏరియాల ఏర్పాటుకు స్థలం చదును
- కొన్నిచోట్ల వంతెనల నిర్మాణ పనులు వేగవంతం
- నాలుగు లైన్ల జాతీయ రహదారి త్వరలోనే అందుబాటులోకి!
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో అభివృద్ధికి దోహదం
- పారిశ్రామిక ప్రగతికి, చౌక రవాణాకు వీలు



నిర్మాణ పనులు పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ హైవే

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

విశాఖ-రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే... ఇటు ఉత్తరాంధ్ర ఆయువుపట్టు విశాఖనగరాన్ని అటు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌ను అనుసంధానం చేయడానికి దాదాపు రూ.20వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మరో జాతీయ రహదారి. ఉమ్మడి విజయనగరం జిల్లాలు, ఒడిశా మీదుగా సాగే ఇది త్వరలోనే అందుబాటులోకి రానుంది. 2022 నవంబర్‌లో విశాఖ నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణ పనులు చకచకా జరిగేందుకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 710.58 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియను ఆగమేఘాలపై పూర్తిచేసి నిర్మాణ సంస్థకు స్వాధీనం చేసింది. దీంతో నిర్మాణ పనులు శరవేగంగా మొదలయ్యాయి. ఇప్పటికే నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కొన్నిచోట్ల వంతెనల నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఐదుచోట్ల ఇంటర్‌చేంజ్‌ల నిర్మాణం కూడా వేగవంతమైంది. నాలుగుచోట్ల రెస్ట్ ఏరియాల (విశ్రాంతి ప్రదేశాలు) ఏర్పాటు కోసం స్థలం చదును పూర్తి అయ్యింది. నిర్ణీత లక్ష్యం ప్రకారం ఈ ఏడాది ఆఖర్లోకల్లా ఈ జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



జామి వద్ద సిద్ధమైన ఇంటర్‌చేంజ్ ఫ్లైఓవర్

ఉత్తరాంధ్రకు మణిహారంలా...

విశాఖ నగరం రెండు ఓడరేవులతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్గో కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. ఈ వాణిజ్య స్థాయిని మరింత విస్తృతం చేసి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2014 సంవత్సరంలోనే రాయ్‌పూర్-విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ ఆలోచన చేసింది. 2017లోనే డీపీఆర్ సిద్ధమైంది. కానీ తర్వాత పనులు ముందుకెళ్లలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కదలిక వచ్చింది. 2022 నవంబరులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసే సమయానికే ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణను రాష్ట్ర ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసింది. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు సకాలంలో 710.58 హెక్టార్ల భూమిని స్వాధీనం చేసింది. ఇందులో ప్రభుత్వ భూమి 159.08 హెక్టార్లు కాగా మిగిలినది రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించి సేకరించింది. దాదాపు రూ.20 వేల కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ రహదారి పొడవు 464 కిలోమీటర్లు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లను అనుసంధానం చేస్తుంది. మన రాష్ట్రం విషయానికొస్తే అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోనే దాదాపు వంద కిలోమీటర్ల పొడవున ఇది సాగుతుంది. అందులో విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోనే 90 కిలోమీటర్లకు పైగా ఉంది.

శరవేగంగా నిర్మాణ పనులు....

సబ్బవరం నుంచి పాచిపెంట మండలంలో ఒడిశా సరిహద్దు వరకూ నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో ఒకటి (పాచిపెంట మండలంలోని మాతుమూరు), విజయనగరం జిల్లాలో నాలుగు చోట్ల (మెంటాడ మండల కేంద్రం, గంట్యాడ మండలంలోని కొర్లాం జంక్షన్, జామి మండల కేంద్రం, కొత్తవలస మండలంలోని ఉత్తరాపల్లి) ఇంటర్‌చేంజ్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. అనకాపల్లి జిల్లాలో మరో ఇంటర్ చేంజ్ ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. సుదీర్ఘ ప్రయాణంలో అలసిపోయే డ్రైవర్లు మార్గంమధ్యలో కాసేపు విశ్రాంతి తీసుకొనేలా పార్వతీపురం జిల్లాలో రెండు, విజయనగరం జిల్లాలో రెండు చోట్ల రెస్ట్ ఏరియాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం హైవేను ఆనుకొని అవసరమైన స్థలాలను చదును చేశారు.

నాలుగు ప్యాకేజీలుగా నిర్మాణ పనులు...

ప్యాకేజీ	రోడ్డు పొడవు	విస్తరించిన జిల్లాలు
1 (ఆలూరు-జక్కువ)	**31.767** కి.మీ	పార్వతీపురం (19.767 కిమీ), విజయనగరం (12 కి.మీ)
2 (జక్కువ-కొర్లాం)	**24.30** కి.మీ	విజయనగరం
3 (కొర్లాం-కంటకాపల్లి)	**24** కి.మీ	విజయనగరం
4 (కంటకాపల్లి-సబ్బవరం)	**19.562** కి.మీ	విజయనగరం (14.73 కి.మీ), అనకాపల్లి (4.832 కి.మీ)



గ్రీన్‌ఫీల్డ్ హైవేపై కొర్లాం సమీపంలో సిద్ధమవుతున్న టోల్‌గేట్

ఉత్తరాంధ్రలో గ్రీన్‌ఫీల్డ్ హైవే...

మండలం	హైవే గ్రామాలు
అనకాపల్లి జిల్లాలో...	
సబ్బవరం	మొగలిపురం, గుల్లిపల్లి, సబ్బవరం
విజయనగరం జిల్లాలో...	
కొత్తవలస	చిన్నిపాలెం, రాయపురాజుపురం, వీరభద్రపురం, చీపురువలస, గులివిందాడ, దెందేరు, సంతపాలెం
లక్కవరపుకోట	భీమాలి, నిడిగట్టు
జామి	తాండ్రంగి, జన్నివలస, జామి, జద్దేతివలస, గోడికొమ్ము, అలమండ, సిరికిపాలెం
గంట్యాడ	పెదమజ్జిపాలెం, గింజేరు, కొండతామరపల్లి, కొర్లాం, పొల్లంకి, పెంటశ్రీరామపురం, వసంత
బొండపల్లి	దేవుపల్లి, గ్రహపతి అగ్రహారం, మరువాడ, కొత్తపాలెం, గుమడాం
గజపతినగరం	కొనిస
మెంటాడ	పులిగుమ్మి, పోరంలోవ, ఉద్దంగి, బుచ్చిరాజుపేట, గురమ్మవలస, జక్కువ, జయతి, అమరయ్యవలస, మెంటాడ
రామభద్రపురం	పెదచెలగాం, రావివలస, ఎనుబారువు, కొండకెంగువ, చందాపురం
పార్వతీపురం మన్యం జిల్లాలో....	
మండలం	**గ్రామాలు**
పాచిపెంట	ఆలూరు, కొటికిపెంట, గార్లెవలస, మాతుమూరు, సరయవలస, గురివినాయుడుపేట, మోసూరు

న్యూస్‌రీల్

వ్యర్థ పదార్థాల నిర్వహణతో ప్రయోజనం

- జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు వి.పద్మజ



విద్యార్థులకు వ్యర్థాల పునర్వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పద్మజ

గుమ్మలక్ష్మీపురం: వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ చేసి అవసరమైన వనరులుగా మార్చుకుంటే ప్రయోజనం పొందడంతో పాటు ప్రకృతిని కాపాడవచ్చని పార్వతీపురం జట్టు అనాథ ఆశ్రమం నిర్వాహకురాలు వి.పద్మజ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యర్థ పదార్థాలను నిర్వహించుకోవడం వల్ల విద్యుత్ శక్తిని తయారు చేసుకోవచ్చని, మానవులకు ఉపయోగపడే అనేక వస్తువులను తయారుచేసి ప్రకృతిని సమతుల్యం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు స్వరూప, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 30 నుంచి నిరవధిక సమ్మె



సమ్మె నోటీసును వైద్యాధికారులకు అందజేస్తున్న భద్రగిరి సీహెచ్‌సీ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30 నుంచి నిరవధిక విధుల బహిష్కరణ (సమ్మె) చేపట్టనున్నట్టు భద్రగిరి సీహెచ్‌సీ పారిశుద్ధ్యం, సెక్యూరిటీ సిబ్బంది స్పష్టం చేశారు. ఈ మేరకు వైద్యాధికారులకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్నా సరైన గుర్తింపు లేదని, కనీస వేతనం ఇవ్వడంలేదని, ఇచ్చిన అరకొర వేతనం కూడా రెండుమూడు నెలలకోసారి ఇస్తున్నారని పారిశుద్ధ్య, సెక్యూరిటీ సిబ్బంది వెంకటరావు, శ్రీరాములు, గౌరమ్మ, బారికి తదితరులు వాపోయారు. డిమాండ్లు పరిష్కరించాలని దశలవారీగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఈ నెల 30 నుంచి నిరవధిక విధుల బహిష్కరణ చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

పర్యాటక దినోత్సవం ఏర్పాట్ల పరిశీలన

సీతంపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఈనెల 27న సీతంపేటలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. అడ్వంచర్ పార్కులో లైటింగ్ పెంచాలని, అన్ని సాహస క్రీడలు పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని, ఐలవ్ సీతంపేట బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డీపీఓ సతీష్, తదితరులు ఉన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- ఐటీడీఏలో నిర్వహించిన జాబ్‌మేళాలో 95 మంది ఎంపిక
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: యువత ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్, ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిమిత్ర సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. యువత ఎల్లప్పుడూ చిన్నచిన్న లక్ష్యాలను కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. త్వరలో జిల్లాలో సుమారు 200 మందికి డీఎస్సీ శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఆర్మీ ఉద్యోగాలకు వెళ్లేవారికి రాతపరీక్షలో తర్ఫీదునిచ్చేందుకు జిల్లాలో ప్రత్యేక కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామని చెప్పారు. జాబ్ మేళాలో అరబిందో ఫార్మసీ, అవంతీఫుడ్స్ లిమిటెడ్, రక్షా సెక్యూరిటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 543 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అవంతీఫుడ్స్ లిమిటెడ్ 65 మంది, రక్షా సెక్యూరిటీ సర్వీసెస్ 30 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఐటీడీఏ పీఓ ఆశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ఏపీఓ ఎ.మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కాదు..
ప్రజలను ముంచిన ప్రభుత్వం

- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది
- పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే తెరపైకి తిరుపతి లడ్డూ వివాదం
- నాడు ఎన్టీఆర్‌ను, నేడు ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు
- పాలనాతీరును ఎండగట్టిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ఇది మంచి ప్రభుత్వం కాదని, ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను ముంచేసిన ప్రభుత్వంగా టీడీపీ కూటమి ప్రభుత్వం చరిత్ర పుటల్లో నిలిచిపోనుందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరులోని తన స్వగృహంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వమంటూ ప్రచారం చేయడం సరికాదని, ఇది ప్రజలను మోసం చేసిన, ముంచిన ప్రభుత్వమని వాస్తవాలను ప్రచారం చేయాల్సిందన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం బడ్జెట్ ప్రవేశపెట్టని ఏకైక రాష్ట్రం మనదే అని నిప్పులుచెరిగారు.

వరదబాధితులను ఆదుకోవడంలో విఫలం

విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని రాజన్నదొర విమర్శించారు. రెండు రోజులుగా బాధితులు ధర్నాలు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. మంత్రి సంధ్యారాణి ఇటీవల కుర్మరాజుపేట సమావేశంలో ప్రభుత్వం అప్పు చేయలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మరి రూ.40వేల కోట్లు అప్పుచేసినట్టు చెబుతున్న ఆర్థిక నివేదికలు తప్పా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలతో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను 2014లో వలే నేడు 2024లోనూ చంద్రబాబునాయుడు మోసంచేస్తున్నారని విమర్శించారు. తిరుపతి లడ్డూ తయారీ విషయంలో దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. దేవుడి విషయంలో రాజకీయాలు చేస్తే దోషులను ఆ దేవుడే శిక్షిస్తాడన్నారు. వంద రోజుల పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే తిరుపతి లడ్డూ వివాదాన్ని టీడీపీ నేతలు తెరపైకి తెచ్చారని విమర్శించారు. నాడు ఎన్టీఆర్‌కు, నేడు ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. ప్రజల కోసం ప్రజాపోరాటాలకు, అవసరమైతే న్యాయపోరాటాలకు వైఎస్సార్‌సీపీ సిద్ధమని స్పష్టం చేశారు. సాలూరు ఎంపీపీ రాములమ్మ, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, ఎస్.గుణవతమ్మ, నాయకుడు ఆదయ్య పాల్గొన్నారు.

గత ప్రభుత్వం వంద రోజుల్లో 87 శాతం హామీలు అమలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అధికారంలోకి వచ్చిన 100 రోజులకు 87 శాతం హామీల అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని రాజన్నదొర గుర్తుచేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వ ఖజానాలో కేవలం 100 కోట్లే ఉండేదన్నారు. అదే నేడు టీడీపీ అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వ ఖజానాలో 7 వేల కోట్లు ఉన్నట్టు వెల్లడించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతగా ఎదుర్కొని సంక్షేమ పాలన అందించిందని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ఒక్క సంక్షేమ పథకాన్ని అందించలేదని ఎద్దేవా చేశారు. తక్షణమే సంక్షేమ, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో 50వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్న చంద్రబాబు... నేడు మెగా డీఎస్సీ అంటూ కేవలం 16,400 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని పేర్కొనడం నిరుద్యోగులను దగా చేయడమేనన్నారు. ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగభృతి వంటి పథకాల ఊసేలేదన్నారు.

కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు

- సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 3 నుంచి 12 వరకు జరగనున్న దసరా ఉత్సవాలపై దిశానిర్దేశం చేశారు. శాఖల వారీగా చేపట్టాల్సిన బాధ్యతలను వివరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి దుర్గాదేవిని దర్శించుకునేందుకు అశేషంగా భక్తులు రానున్నారని, దీనికోసం ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ప్రధానంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రాంబాబుకు సూచించారు. క్యూలైన్ల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, తాగునీరు, వైద్యసేవలు ఆలయ ఆవరణలో ఉండాలని, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు సూచించారు.

పీఎంశ్రీతో పాఠశాలల అభివృద్ధి

- జిల్లాలో తొలివిడతగా 19 స్కూళ్ల ఎంపిక
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పీఎం శ్రీ వివరాలను వెల్లడిస్తున్న కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకానికి జిల్లా నుంచి 19 పాఠశాలలు ఎంపికైనట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో రెండు ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. 2022-23 నుంచి 2026-27 వరకు ఐదేళ్లపాటు పథకం కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. వీటితో ప్రయోగశాలలు, విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలు సమకూర్చుకోవడం, డిజిటల్ పద్ధతిలో బోధన తదితర సౌకర్యాలు కల్పించుకోవచ్చని వివరించారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు. ఆయా పాఠశాలల్లో ఇప్పటికే ఇంటర్నెట్ సౌకర్యంతో వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేశామని చెప్పారు. పీఎంశ్రీ పథకం కింద 14 పాఠశాలలల్లో క్రీడా మైదానాలకు, ఐదు పాఠశాలలకు అటల్ టింకరింగ్‌ల్యాబ్‌లకు రూ.1.41 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పాఠశాలల ప్రాంగణాలను పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ స్కూల్స్‌గా మార్చుతున్నట్లు కలెక్టర్ చెప్పారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించడం.. సోలార్ ప్యానెళ్లు, ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యర్థాల నిర్వహణ వంటివి చేపడుతున్నట్టు చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పుతారన్నారు.

అన్ని పాఠశాలల్లో మనబడి-మనతోట

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి, ప్రకృతి, పర్యావరణం పట్ల ఆసక్తి, అవగాహన కల్పించడానికి మనబడి-మనతోట కార్యక్రమం అమలు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 1,594 పాఠశాలల్లో భూమి అందుబాటులో ఉన్న 1,272 పాఠశాలల్లో కూరగాయలు, ఆకుకూరలు పెంచుతామని చెప్పారు. అందుకు అవసరమైన 10 రకాల కూరగాయలు, 5 రకాల ఆకుకూరల విత్తనాల గల కిట్లను అందిస్తున్నామన్నారు. మన బడి-మన తోట నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 149 మంది ఉపాధ్యాయులకు జట్టుట్రస్టు ద్వారా శిక్షణ అందించామని చెప్పారు. ఇక్కడ పండించిన కూరగాయలు, ఆకుకూరలు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తామని తెలిపారు.

విద్యార్థుల పూర్తి సమాచారంతో రిపోర్టులు

బంగారు భవిత కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, విద్యాప్రమాణాలకు సంబంధించి పూర్తి సమాచారంతో రిపోర్టులను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అందులో విద్యార్థుల విద్యకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టుతో పాటు, వారి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు ప్రతినెలా రక్తహీనతకు సంబంధించిన పరీక్షలు, బ్లడ్ గ్రూప్, ఆధార్ నంబర్, తల్లిదండ్రుల వివరాలు, వారి హాబీలు, మార్కులు, ఇతర వివరాలన్నీ అందులో ఉంటాయన్నారు. మై స్కూల్.. మై ప్రైడ్ ప్లస్ కార్యక్రమం ద్వారా ఉత్తీర్ణత శాతం పెంచడంతో పాటు, విద్యాప్రమాణాలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గార పగడాలమ్మ, పీఎంయూ నోడల్ అధికారి పున్నపు లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన బదిలీ అధికారులు



బదిలీపై వెళ్తున్న అధికారులతో కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ ఇతర జిల్లాలకు బదిలీ అయిన పలువురు జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం కలిశారు. వారందరినీ కలెక్టర్ అభినందిస్తూ జిల్లాలో వారు అందించిన సేవలను ప్రశంసించారు. ఆయా జిల్లాల్లో నియమించిన స్థానాల్లో సమర్థులైన అధికారులుగా పేరు తెచ్చుకోవాలని అభిలషించారు.

మహిళా గర్జన పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ



మహిళాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం: సమాజంలో మహిళలు, చిన్నారులపై పెరిగిపోతున్న దాడులను ప్రతిఘటించేందుకు, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు వాజీ చానల్, మహిళా గర్జన కమిటీ ఈ నెల 30వ తేదీన ఉదయం 9 గంటలకు మహిళా గర్జన అనే పేరుతో కోట జంక్షన్ వద్ద బృహత్తర కార్యక్రమం చేపట్టనున్నాయి. ఈ కార్యక్రమంలో విజయవంతం కావాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆకాంక్షిస్తూ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కోట వద్ద జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా భావించాలని వాజీ చానల్ పిలుపునిచ్చింది. కార్యక్రమంలో చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

1324 లీటర్ల సారా పారబోత

సీతంపేట: మండలంలోని సీతంపేట, దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 36 కేసుల్లో సీజ్‌చేసిన 1324.75 లీటర్ల సారాను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు పర్యవేక్షణలో పారబోసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు మంగళవారం తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు అక్రమంగా రవాణా చేసిన కేసుల్లో పట్టుకున్న సారా నిర్వీర్యమైనట్లు చెప్పారు.

పోలీసుల అదుపులో ఏడుగురు పేకాట రాయళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి రహదారిలో ఉన్న టిడ్కో కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేపట్టగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై గణేష్ తెలిపారు. వారి నుంచి రూ.25,060 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు అస్వస్థత



ఎస్‌కోట ఏరియా ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కర రావు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినులు సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆరుగురు విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారన్న సమాచారం అందుకున్న స్థానిక హెల్త్ అసిస్టెంట్ శంకరరావు మంగళవారం ఉదయం హుటాహుటిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తన బైక్‌పై తీసుకెళ్లి జాయిన్ చేసి, ప్రాథమిక వైద్యం చేయించి. విషయాన్ని కొట్టాం వైద్యాధికారులకు తెలిపారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది హాస్టల్‌లో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. వైద్యులకు తగిన సూచనలు ఇచ్చారు. వారం రోజుల పాటు నిత్యం హాస్టల్ విద్యార్థులపై ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారికి ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో కొట్టాం పీహెచ్‌సీ, ఎస్‌కోట ఏరియా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹218

కదం తొక్కిన గిరిజన రైతులు

- బడిదేవరకొండ లీజులు రద్దు చేయాలి
- గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలి
- కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ దగ్గర ఆందోళన చేస్తున్న నాయకులు, గిరిజనులు

పార్వతీపురం: గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు రెవెన్యూ పట్టాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో తాన్నవలస, వెలగవలస, దోనిగెడ్డవలస, చందివలస, గంగాపురం, తొక్కుడు వలస, సీతంపేట, పనసభద్ర, నక్షంద్రవలస తదితర గ్రామాలకు చెందిన గిరిజనులతో ఆందోళన నిర్వహించారు. ఆందోళన చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో కలెక్టరేట్ ఎదుటే బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో బడిదేవర కొండకు గ్రానైట్ తవ్వకాల కోసం అప్పటి ప్రభుత్వం అనుమతులను జారీ చేసిందన్నారు. ఆ ప్రాంతం కొండ రిజర్వ్ ఫారెస్టులో ఉందని దాని అనుమతులను రద్దు చేసినట్లు ఫారెస్టు అధికారులు పేర్కొన్నారన్నారు. అయితే అప్పటికే గిరిజనులకు ఆ ప్రాంతంలో కొండపై సాగు చేస్తున్న భూములకు సుమారు 2,500 మందికి పోడు పట్టాలు కూడా అందజేశారని, వారికి రైతు భరోసా తదితర పథకాలను కూడా గత ప్రభుత్వం అందించిందన్నారు. గిరిజనులకు మంజూరు చేసిన పట్టాలను రద్దుచేయడం సరైనది కాదని, గతంలో ఇచ్చిన పట్టాల స్థానంలో అటవీశాఖ పట్టాలుగా మార్చి గిరిజనులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనానికి అన్యాయం సరికాదు

ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలతో కుమ్మక్కై కొండ తవ్వకాలకు అనుగుణంగా సర్వే రికార్డులను తారుమారు చేసి గిరిజనులకు అన్యాయం చేయడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పట్టాలను పునరుద్ధరించడంతోపాటు ఈప్రాంత ఆరాధ్య దైవంగా భావించే బడిదేవర కొండ లీజులైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి. కేశవనాయుడికి అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బంటు దాసు, సీఐటీయూ నాయకుడు బి.సూరిబాబు, గిరిజన సంఘ నాయకులు పి.రాము, ఎస్.చిరంజీవి, ఎం.బాషాతో పాటు వందలాది మంది గిరిజనులు పాల్గొన్నారు.

ఫారెస్టు ఆఫీస్ వద్ద ధర్నా



ర్యాలీలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు, గిరిజనులు

పార్వతీపురం టౌన్: బడిదేవరకొండ రిజర్వ్ ఫారెస్టుగా నమోదై ఉన్నప్పటికీ మైనింగ్ అనమతులు ఏ విధంగా ఇస్తారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణ మూర్తి అధికారులను నిలదీశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఫారెస్టు ఆఫీస్ వద్ద ధర్నాకు దిగారు. అనంతరం కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

పైడితల్లమ్మ జాతరకు మౌలిక సదుపాయాలు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య
- నగరంలో క్షేత్ర స్థాయి పర్యటన



అమ్మవారి జాతర ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: వచ్చే నెల 14,15 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర మహోత్సవానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. సిరిమానోత్సవంలో ప్రధాన ఘట్టమైన సిరిమాను తరలింపు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకట్రావు, పైడితల్లమ్మ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీవీవీ ప్రసాదరావు, విజయనగరం కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సిరిమాను తరలించే ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పరిశీలన చేపట్టారు. జమ్ము ప్రాంతం నుంచి రింగ్‌రోడ్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, బాలాజీ జంక్షన్, ఆర్‌టీసీ కాంప్లెక్స్, వనంగుడి, ఎన్ సీఎస్, గంటస్తంభం, చదురుగుడి, మీదుగా హుకుంపేట వరకు ఆయన పర్యటించి ఆయా ప్రాంతాలలో గుంతలను పరిశీలించారు. అక్కడక్కడ చిన్నచిన్న గుంతలు ఉన్నట్లు గుర్తించి వెంటనే వాటిని పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సిరిమాను తరలించే సమయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. పుచ్చలవీధి జంక్షన్ నుంచి ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ కే శ్రీనివాసరావు, డీఈలు,ఏఈలు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

రాజాం సిటీ: ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎస్.గోవిందరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు హెటిరో డ్రగ్స్, ఇన్నోవా సోర్స్, భారత్ ఫైనాన్స్ ఇంక్లుసన్ లిమిటెడ్‌లు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత పొంది 18 నుంచి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువత www.apssdc.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకుని దాని రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమ్, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఉదయం 9గంటలకు ఐటీఐలో జరగనున్న జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7286042743, 9988853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైర్‌లెస్ సెట్‌లోనే విన్నపాలు

- ఎస్పీ వకుల్ జిందాల్



వైర్‌లెస్ సెట్ ద్వారా సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందాల్ వినూత్న కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఎన్నో వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వచ్చి, పోలీసు కార్యాలయంలో తమ సమస్యలను విన్నవించుకుని, వాటి పరిష్కారానికి వేచి చూసే పరిస్థితులకు ఎస్పీ స్వస్తి పలికారు. పోలీస్ సిబ్బంది సమస్యలను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారి ద్వారా విన్నవించాలని సూచించారు. ఇదే అవకాశంగా భావించిన పోలీసు సిబ్బంది తమ సమస్యలను ఒక్కొక్కటిగా సంబంధిత పోలీసు అధికారి ద్వారా జిల్లా పోలీసు కార్యాలయానికి విన్నవించారు. వాటిని పరిశీలించిన ఎస్పీ ఆ సమస్యలను పరిష్కరించడంలో భాగంగా సిబ్బందిని జిల్లా కేంద్రానికి రాకుండా వారి పోలీసు స్టేషన్‌లోనే వైర్‌లెస్ సెట్ వద్ద హాజరై ఉండాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం అధికారులు, సిబ్బందిని తన కార్యాలయానికి ఎస్పీ పిలిచి, వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సంబంధిత పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయం ఉద్యోగులతో వైర్‌లెస్ సెట్‌లోనే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారానికి ఇంకా ఎంత సమయం పడుతుందో తెలిపి, వారి విన్నపం ప్రస్తుత స్థితిని ఎస్పీ సమక్షంలోనే వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఏవీ.లీలారావు, డీపీఓ ఏఓ ఇన్చార్జ్ సీఐ ఈ.నరసింహమూర్తి, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, జిల్లా పోలీసు కార్యాలయం పర్యవేక్షకులు ప్రభాకరరావు, వెంకటలక్ష్మి, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ముప్పు



సంఘటన స్థలంలో లారీ

దత్తిరాజేరు: మండలంలోని దత్తి రోడ్డు కూడలి సమీపంలో దత్తిరాజేరు ఇండియన్ గ్యాస్ గొడౌన్ నుంచి ఖాళీ గ్యాస్ సిలిండర్లను తీసుకెళ్తున్న లారీ అదుపుతప్పి మంగళవారం చింత చెట్టును ఢీకొట్టింది. ఆ సమయంలో అటుగా వాహన చోదకులు కానీ బాటసారులు, మిల్లులో పనిచేసే కూలీలు అటువైపు వెళ్లక పోవడంతో పెద్దముప్పు తప్పింది. లారీలో ఉన్న ఖాళీ సిలిండర్‌లు చెల్లాచెదురు కావడంతో స్థానికులు అక్కడికి చేరుకుని వాటిని తీసి లారీలో వేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెదనాపురం పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సురాన అంకిత మహవీర్

పార్వతీపురం టౌన్: మాయమాటలతో మేనత్తను మోసం చేసి బంగారం దోచుకున్న నిందితుడిని పోలీసులు పట్టుకుని సొత్తు రికవరీ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఏఎస్పీ సురాన అంకిత మహవీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన మణెమ్మ ఇంటికి రాజమండ్రికి చెందిన ఆమె మేనల్లుడు కె.లక్ష్మణరావు జూలై 26న వచ్చాడు. మణెమ్మ కుమార్తెకు వివాహం కుదుర్చుతానని ఆమెకు మాయమాటలు చెప్పాడు. జూలై 27 ఉదయం 5 గంటల సమయంలో మణెమ్మ ఇంట్లో గల బీరువాలోని 16.5 తులాల బంగారం చోరీ చేసి పారిపోయాడు. ఈ నెల 18న బాధితుల పిర్యాదు మేరకు పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన బంగారాన్ని అమ్మేందుకు లక్ష్మణరావు పార్వతీపురం పట్టణానికి మంగళవారం వస్తుండగా నర్సిపురం గ్రామ సమీపంలో సీఐతో పాటు ఎస్సై దినకర్, రూరల్ పోలీసులు, సీసీఎస్ సిబ్బంది వలవన్ని పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన రూరల్ సీఐ, ఎస్సై, సిబ్బంది, సీసీఎస్ టీమ్‌ను ఏఎస్పీ సురాన అంకిత్ మహవీర్ అభినందించారు.

నూతన మద్యం విధానంతో పొట్టకొట్టొద్దు



అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నెల్లిమర్ల: నూతన మద్యం విధానంతో తమ పొట్టకొట్టొద్దని వైన్‌షాపుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైన్‌షాపుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్, సెక్యూరిటీ ఉద్యోగులు స్థానిక ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ గొడౌన్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం నూతన మద్యం విధానం తీసుకొచ్చిన దృష్ట్యా తమకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అసిస్టెంట్ మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, నెల్లిమర్ల ఎస్సై గణేష్, సిబ్బంది గొడౌన్‌వద్ద బందోబస్తు నిర్వహించారు.

24.66 కేజీల గంజాయి పట్టివేత



పట్టుకున్న నిందితుడు, గంజాయితో పోలీసులు

సాలూరు రూరల్: మండలంలోని జీగిరాం గ్రామం వద్ద మంగళవారం ఉదయం 24.66 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఒడిశా నుంచి సాలూరు వైపు వస్తున్న రెండు ద్విచక్రవాహనాలపై ఇద్దరు నిందితులు అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో గంగరాజ్‌పూర్ గ్రామం పొట్టంగి బ్లాక్ ఒడిశాకి చెందిన సుశాంత్ బంకాను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు పారిపోగా రెండు స్కూటీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

రెండో రోజూ స్కూల్‌గేమ్స్‌కు స్పందన

- అండర్–17 విభాగంలో 500 మంది హాజరు
- నేడు అండర్–14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక



అండర్ 17 విభాగంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: పాఠశాలస్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్‌కు స్పందన లభిస్తోంది. నగర శివారుల్లో గల విజ్జి స్టేడియంలో రెండవ రోజు మంగళవారం అండర్ 17 విభాగంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 500 మందికి పైగా క్రీడాకారులు వివిధ పాఠశాలల నుంచి హాజరయ్యారు. వారికి మొత్తం ఆరు విభాగాల్లో ఎందుకు పోటీలు నిర్వహించి మొత్తం 18 మంది క్రీడాకారులకు జిల్లా స్థాయిలో జరగనున్న ఎంపిక పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గం ప్రతినిధి కె.తౌడు బాబు తెలిపారు. అదేవిధంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి అండర్ 14, 17 విభాగాల్లో బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో నియోజకవర్గస్థాయిలో అర్హత ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చని సూచించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామం వద్ద వేగావతి నదిలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ మేరకు సీఐ సతీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. బూర్జివలస గ్రామ సమీపంలో ఎస్సై రమేష్, సిబ్బంది ఇసుక ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నారని అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వి రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదుచేశామని చెప్పారు.

రైళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ

- విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్



విజయనగరం జీఆర్‌పీ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న లైన్స్ ఇన్‌స్పెక్టర్ అడబాల రవికుమార్

విజయనగరం క్రైమ్: రైళ్లలో దొంగతనాలు జరగకుండా సిబ్బంది విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, అనుమానితులను వెంటనే విచారించాలని విశాఖ రైల్వే ఇన్‌స్పెక్టర్ అడబాల రవికుమార్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్‌గా కొత్తగా నియమితులైన ఆయన మంగళవారం విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన విషయాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిషేధిత గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి, తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. రైళ్లలో ప్రత్యేక బీట్‌లలో విధులు నిర్వహించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బాలాజీరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి



నవీన్‌కుమార్ మృతదేహం

చీపురుపల్లిరూరల్(గరివిడి): చీపురుపల్లి–గరివిడి ప్రధాన రహదారిలో ఆదర్శ డిగ్రీ కళాశాల సమీపంలో టీటైమ్ షాపు దగ్గర మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డి నవీన్‌కుమార్ (31) మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి మృతుని తల్లి కస్తూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.లోకేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ ఉదయం 9గంటల సమయంలో ఇంటిసామగ్రి కొనుగోలు నిమిత్తం ద్విచక్రవాహనంపై గరివిడి వెళ్తున్నాడు. అదే సమయంలో విజయనగరం నుంచి గరివిడి మీదుగా చీపురుపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టీ టైమ్ షాపు దగ్గరలో ఆ యువకుడిని ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం కాగా స్థానికులు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో వైద్యులు ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు.


రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గజపతినగరం: మండలంలోని దావాల పేట రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలియజేస్తూ 30సంవత్సరాలు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ట్రైన్ నుంచి జారిపడి తీవ్రగాయాలపాలై మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి శరీరంపై నలుపు రంగు హాఫ్ ప్యాంట్, పింక్ కలర్ షర్ట్ ఉన్నాయని ఆచూకీ తెలిసిన ఎడల ఫోన్ 9491813163, 9490617089,8309901038 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని విజయనగరంలోని గవర్నమెంట్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు.

నేలబావిలో పడి వృద్ధుడు..



నేలబావిలో పడి మృతిచెందిన తాతబాబు.

రేగిడి: మండల పరిధిలోని జోడుబందల గ్రామానికి చెందిన బొత్స తాతబాబు (75) నేలబావిలో పడి మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్సై పి.నీలావతి అందించిన వివరాల ప్రకారం తాతబాబుకు మద్యం తాగే అలవాటు ఉంది. మద్యంమత్తులో ఊరి పక్కనే ఉన్న పొలంవైపు వెళ్తున్న సమయంలో గమనించక నేలబావిలో పడిపోయాడు. కుటుంబసభ్యులు ఈ సమాచారం తెలుసుకుని వెళ్లి చూసి మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య గీత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

లిఫ్ట్ ఇచ్చి దోపిడీ

- నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: తన బైక్‌పై లిఫ్ట్ ఇస్తానని చెప్పి కొంత దూరం తీసుకువెళ్లి రూ.50వేలు నగదును దౌర్జన్యంగా లాక్కుని పరారైన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన నక్కన లక్ష్మణరావు తన కుటుంబసభ్యుల ఎల్ఐసి బాండ్స్ రెన్యువల్ కోసం ఈ నెల 13న విజయనగరం ఎల్ఐసీ కార్యాలయానికి వచ్చాడు. అక్కడ టెక్నికల్ సమస్య ఉండడంతో ఆ డబ్బులు కట్టకుండా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతంలో ఉన్న వైన్‌షాప్ వద్దకు వచ్చి మద్యం తాగాడు. అది గమనించిన నిందితుడు తన స్కూటీపై లిఫ్ట్ ఇస్తానని బైక్ ఎక్కించి సీఎంఆర్ మాల్ వైపు తీసుకువెళ్లి, లక్ష్మణ రావు వద్ద ఉన్న రూ. 50వేల నగదును దౌర్జన్యంగా లాక్కుని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు టెక్నికల్ సపోర్ట్‌తో నిందితుడ్ని గుర్తించారు. పద్మావతినగర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నప్పుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం, అల్లినగరానికి చెందిన నిందితుడు బసవ కనకరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేసి రూ.38,500 నగదు, ఎల్ఐసీ బాండ్ రిసీప్ట్స్, స్నాచింగ్‌కు ఉపయోగించిన యమహా బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.